# మనం
## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
సోమవారం | 30 | అక్టోబర్ | 2023 | పేజీలు : 7






- తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్సే
- కాంగ్రెస్ నౌకరీలు కల్పిస్తే బీజేపి అమ్ముకుంటోంది
- కర్ణాటక అభివృద్ధి చూసొద్దామా?
- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు
- ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే



# అప్పులపాలు చేశారు

సంగారెడ్డి/మెదక్, అక్టోబర్ 29, మనం న్యూస్ః తెలంగాణ ఏర్పడిన నాడు సర్‌ప్లస్‌గా ఉన్న పరిస్థితులు పోయి తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఐదు లక్షల కోట్ల అప్పుల కుప్పగా చేశారని ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. తెలంగాణను అభివృద్ధి చేశామంటూ గొప్పలు పలుకుతున్న కేసీఆర్ ఒక్కసారి గతం గుర్తు తెచ్చుకోవాలన్నారు. త్యాగాలను చూసి స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేర్చేందుకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే నేడు కేసీఆర్ కుటుంబం ఎంజాయ్ చేస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారంనాడు ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి తూర్పు జయప్రకాష్‌రెడ్డి, మెదక్

మిగతా 2లో..



## వంద కోట్లకు టికెట్ అమ్ముకున్న బిఆర్ఎస్

- -ఉద్యమకారులకు బిఆర్ఎస్‌లో చోటు లేదు
- -కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా
- -30 రోజులు కష్టపడండి.. ఐదేండ్లు సేవ చేస్తా
- -దుబ్బాక అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- -కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



2 లో

## కష్టపడే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు

### మంత్రి హరీష్‌రావు

కొండపాక, అక్టోబర్ 29, మనం న్యూస్ః పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. కొండపాక మండలంలోని పలువురు కార్యకర్తలు, నాయకులు గత కొద్ది రోజుల నుండి అసమ్మతితో ఉండడంతో వారిని హైదరాబాద్‌కు పిలిపించుకొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం కష్టపడుతున్న తమకు గుర్తింపు లేకుండాపోయిందని, మంలంలోని పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు ఇటీవల దుద్దెడలో సమావేశం నిర్వహించారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి ఆదివారం వారితో మాట్లాడి పార్టీ కోసం కష్టపడే వారిని ఎప్పుడూ మర్చిపోదని, వారికి అండగా నిలుస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న విషయాలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన వివరించారు. కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.



## దుబ్బాక గడ్డ కొత్త ప్రభాకర్ అడ్డా

**-దౌల్తాబాద్ యూత్ నాయకులు సయ్యద్ ఖలీలుద్దీన్**



దౌల్తాబాద్, అక్టోబర్ 29, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలవడం ఖాయమని, దుబ్బాక గడ్డ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడ్డా అని దౌల్తాబాద్ యూత్ నాయకులు సయ్యద్ ఖలీలుద్దీన్ అన్నారు. ఆదివారం రోజున వారు విలేకర్లతో మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానే అని, బీజేపి, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలకు ప్రజలు మోసపోకూడదన్నారు. తెలంగాణలో వచ్చేది కే సీఆర్ ప్రభుత్వమే అని, కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో దుబ్బాకలో, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు మాత్రమే విజయం సాధిస్తారన్నారు. తెలంగాణలో ఢిల్లీ గులాములు కాంగ్రెస్, బీజేపికి స్థానం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారానే పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ పఠాన్, షేక్ అలీ, స్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వంద కోట్లకు టికెట్ అమ్ముకున్న బిఆర్ఎస్

దుబ్బాక టౌన్, అక్టోబర్ 29, మనం న్యూస్ః తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వ్యక్తులను కాదని కార్పోరేట్ వ్యాపారం చేసుకునే వ్యక్తికి పార్టీ టికెట్‌ను వంద కోట్లకు అమ్ముకున్న పార్టీ బిఆర్ఎస్ అని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి కోట్లు ఇచ్చే వారుంటే టికెట్లు ఇస్తారు కానీ కాంగ్రెస్ పార్టీలో సేవ చేసే వారుంటేనే టికెట్‌లు కేటాయిస్తారన్నారు. ఆదివారం రోజున దుబ్బాకలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలాల కార్యకర్తల సమావేశంలో దుబ్బాక ఇంచార్జ్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు పెద్ద పీట వేస్తామన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను, ఉద్యమకారుల కుటుంబాలను అణిచివేసి వారి పోరాటాలను, త్యాగాలను కనీసం గుర్తించకుండా కేవలం కుటుంబ పాలనకే పెద్దపీట వేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ కుటుంబమైన సోలిపేట రామలింగారెడ్డి కుటుంబాన్ని కాదని కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన వంద కోట్లకు దుబ్బాక సీటును అమ్ముకున్న నీచ రాజకీయం నాయకుడు హరీష్‌రావు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే త్యాగాలకు పెట్టింది పేరని, నాడు ప్రధానమంత్రి పదవిని కూడా వదులుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గొప్పగా నిర్మించామని చెప్పుకున్న తెరాస ప్రభుత్వం ఆనాడు భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హయాంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలని, దానికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ ఎన్నికల నుండి తప్పుకోవాలన్నారు. నేటికీ బిఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు చోటు లేదని, నాడు ఉద్యమాన్ని నిలిపివేయాలన్నవారు, ఉద్యమంలో లేని వారికి మాత్రమే టికెట్లు ఇచ్చి పదవులు ఇచ్చి వారికి రాజభోగాలు అందిస్తుందని ఆయన విమర్శించారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత బిఆర్ఎస్ పార్టీ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నేడు అప్పుల ఊబిలోకి నెట్టేసిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏనాడూ ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగలేదని, కానీ నేడు బిఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు నిత్యం అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని, నాడు దివంగత నేత ముత్యంరెడ్డి చేసిన రోడ్లు, పాఠశాలలు, మార్కెట్ కమిటీ కార్యాలయాలు, దేవాలయాలు, ప్రభుత్వ



కార్యాలయాలు, వ్యవసాయ కార్యాలయాలు తప్ప బిఆర్ఎస్ కొత్తగా చేసిందేమీ లేదన్నారు. బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిందని, తిరిగి దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు బూత్ స్థాయి నుండి ప్రతి కార్యకర్త ఒక నాయకుడిగా మారి కష్టపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నా కోసం 30 రోజులు కష్టపడి గెలిపించండి మీ కోసం 60 నెలలు ఆగకుండా ప్రజల కోసం, పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్త కోసం పని చేస్తానని, వారందరికీ అండగా ఉండి ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే నమ్మకానికి పెట్టింది పేరని, సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధిని, ఇప్పుడు గెలిచిన తర్వాత అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి, మున్సిపల్ అధ్యక్షులు ఏసురెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మంద శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకుల భరత్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కారు మాదే సర్కారు మాదే

**-కేసీఆర్ భారీ మెజార్టీతో గెలిపిద్దాం**

**-బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ**



జగదేవ్‌పూర్, అక్టోబర్ 29, మనం న్యూస్ః కారు మాదే సర్కారు మాదే అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. ఈసారి ఎన్నికల్లో కేసీఆర్‌ను గజ్వేల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కారు మాదే సర్కారు మాదే అలాగే సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. పార్టీ నేతలతో మాట్లాడుతూ ప్రజా నాయకుడు పార్టీ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతి గడప గడపకు చేరవేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతి గడప గడపకు చేరవేసి అత్యధిక మెజార్టీతో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ప్రతి నాయకుడు కార్యకర్తను కలుపుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ముఖ్య నాయకుల నిర్ణయం మేరకు నవంబర్ 1వ తేదీన కొండపోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఎంపిపి బాలేశం గౌడ్, జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ రంగారెడ్డి, మహిళా అధ్యక్షురాలు స్థానిక ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు బట్టు సుధాకర్‌రెడ్డి, కొండపోచమ్మ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాచర్ల నరేష్, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు ఓటమి భయంతోనే ఈటలపై దుష్ప్రచారాలు



గజ్వేల్, అక్టోబర్ 29, మనం న్యూస్ః గజ్వేల్‌లో ఈటల రాజేందర్ బరిలో నిలుస్తున్నాడన్న భయంతోనే కేసీఆర్‌కు భయం పటుకుందని, ఆ భయంతోనే ఈటలపై దుష్ప్రచారాలు చేస్తున్నారని బీజేపి నియోజకవర్గ నాయకులు బండారు మహేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్‌కు చెందిన తిప్పారం సంపత్ అనే వ్యక్తి దళిత ముసుగులో ఉండి ఈటల రాజేందర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ హుజురాబాద్ నుండి గజ్వేల్‌కు వచ్చి ఈటల బాధిత సంఘం అని గజ్వేల్‌లో ప్రెస్‌మీట్ పెటట్డం సిగ్గుమాలిన చర్య అన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఓటమి భయంతోనే ఈటల మీద ఇలాంటి వారితో తప్పుడు ప్రచారాలకు తెరలేపుతున్నారన్నారు. దళిత ముసుగు వేసుకున్న సంపత్ అనే మూర్ఖుడు బతికేదే ఈటల పేరుమీద అన్నారు. ఈటల గురించి మాట్లాడకపోతే తిండి కూడా దొరకదన్నారు. జనం మెచ్చిన వ్యక్తి ఈటల అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుయుక్తులు చేసినా ఎవరు నమ్మరని నమ్మే పరిస్థితిలో లేరని గుర్తు చేశారు. మరోసారి ఈటల గురించి తప్పుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మధుసూదన్, సీనియర్ నాయకులు సిల్వర్‌జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శులు పెండ్యాల శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, మైస విజయ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



## అప్పులపాలు చేశారు

నియోజకవర్గ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌లను గెలిపించాలంటూ బహిరంగ సభ ర్యాలీల్లో పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, బట్టి విక్రమార్కలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ నాడు ఇందిరాగాంధీ ఇక్కడి నుండి గెలిస్తే దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నాడు ప్రజలకు నౌకరీలు కల్పించేందుకు బాటలు వేస్తే నేడు బీజేపి సర్కార్ అమ్ముతూ వస్తుందన్నారు. నాడు పేదోళ్లకు విద్యనందించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తే నేడు రాష్ట్రంలోని కేసీఆర్ కుటుంబం ఒక్కటే అభివృద్ధి చెందుతుందన్నారు. ఆరు గ్యారంటీలు ముమ్మాటికీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ఖాయమన్నారు. ఉద్యమం పేరుతో ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న కేసీఆర్ నిరంకుశతావన్ని అణిచివేసే సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇస్తే నేడు బిఆర్ఎస్ పదవులు అనుభవిస్తుందన్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు గడిచినా ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చిన పాపాన కేసీఆర్ సర్కార్ పోలేదన్నారు. కర్ణాటకలోని ఐదు గ్యారంటీలను అపహాస్యం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు బస్సుల్లో వచ్చేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. కర్ణాటకకు వెళ్తూ వెళ్తూ మేడిగడ్డనూ పరిశీలిద్దామన్నారు. కిరాయి మనుషులతో కర్ణాటకలో అభివృద్ధి లేదంటూ చేస్తున్న ప్రచారం బట్టబయలైందన్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి, మెదక్‌లో రోహిత్‌లు గెలవడం ముమ్మాటికీ ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మల, హనుమంతరావు, సురేష్ షెట్కార్, కుసుమ కుమార్, మాణిక్యం ఠాక్రే, బోస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే

**5 గంటల కరెంటా...24 గంటల కరెంటా తెల్చుకోండి**

**60 ఏండ్ల తెలంగాణ గోసను పదేండ్లలో తీర్చినం**

**మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి**

**ఆశీర్వదించి గెలిపించాలి**

**హ్యాట్రిక్ విజయానికి నాంది పలకాలి**

**బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్ కుమార్**





హుస్నాబాద్,అక్టోబర్ 29,(మనం న్యూస్)ః కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణకు కూడా కర్ణాటకలో పట్టిన గతే పడుతుందని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. మండలంలోని పోతారం(ఎస్) గ్రామ శివారులోని శుభం గార్డెన్స్‌లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌లు హజరైనారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటయ్యాక కార్మికులకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం కావాలంటే తుపాకీ గుండ్లతో చంపింది కాంగ్రెస్ పార్టీ అంటూ ఆయన దుయ్యబట్టారు. 2000 మందిని బలిదానం తీసుకుంటే కానీ తెలంగాణ ఇవ్వమని చెప్పారన్నారు. మంచిగా ఉన్న రాష్ట్రాన్ని మళ్ళీ కాంగ్రెస్ వచ్చి పాడు చేద్దామని మొసలి కన్నీరు కార్చుతూ పోటీకి దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. మొన్నటికి మొన్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజలు ఎలా ఇబ్బందులు పడుతున్నారో మనం చూస్తున్నామని ఆయన తెలిపారు. ఆ ముఖ్యమంత్రి 5 గంటల కరెంటు ఇస్తున్నాం అంటుండు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కూడా 5 గంటలే కరెంట్ ఇస్తుందన్నారు. 5 గంటల కరెంట్ ఇచ్చేటోడు కావాలా...24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ కావాలో ప్రజలే తెల్చుకోవాలన్నారు. పేదల సంక్షేమానికి పాటు పడుతున్న బీఆర్ఎస్‌కు ఓటేసి ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్‌లో ఏవరు ముఖ్యమంత్రి తెలియదో అన్నారు. 60 ఏండ్ల తెలంగాణ గోసను రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేండ్లలో తీర్చినం అన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని, సతీశ్‌ను ఎమ్మెల్యే చేయాలని ఆయన కోరారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కార్మికుల సమస్యలన్నింటిని తీర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకం కార్మికులకు వర్తింపజేస్తామని ఆయన తెలిపారు. సమాజంలో కార్మికులు గౌరవంగా బ్రతికేందుకు కృషి చేస్తామన్నారు. ఎవరో మాయమాటలు నమ్మి మోసపోకండి ఆలోచించి ఓటు వేయండి అంటూ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టియూ వ్యవస్థాపక అధ్యక్షుడు రూప్‌సింగ్, నేషనల్ లేబర్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏడబోయిన రజిని, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, తదితరులున్నారు.

### నాడు ఎట్ల ఉండే...ఇప్పుడెట్ల ఉందో ఆలోచించాలి

### హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్

2014 కు ముందు హుస్నాబాద్ నియోజకవర్గం ఎట్ల ఉండే ఇప్పుడెట్ల ఉందో ఆలోచించాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్ కుమార్ అన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి 4000 మంది కార్మికులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరోసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కార్మికులందరూ నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఎవరెవరో వస్తారు ఏదో చెప్తారు హుస్నాబాద్ నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందిందో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఒకప్పుడు ఎడారి ప్రాంతంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇపుడు ఏటు చూసిన కనుచూపు మేర పచ్చటి పంట పొలాలు కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే మన తెలంగాణకు వస్తుందని ఆయన చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఆయన అభ్యర్థించారు.

## తెలంగాణకు బిఆర్ఎస్ శ్రీరామ రక్ష



చిన్నకోడూరు, అక్టోబర్ 29, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ఎస్ పార్టీ శ్రీరామ రక్ష అని ఎంపిపి మాణిక్యరెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంనగర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రాబోయే ఎన్నికల్లో గంపగుత్తగా మా ఓట్లన్నీ హరీష్‌రావుకే వేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎంపిపి మాణిక్యరెడ్డికి అందించిన అనంతరం మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు న్యాయం చేసిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని, ప్రజల శ్రేయస్సు, సంక్షేమం గులాబీ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎవరెన్ని ఎత్తుగడలేసినా ముచ్చటగా మూడవసారి తెలంగాణ గడ్డ మీద గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్ గౌడ్, సొసైటీ ఛైర్మన్‌లు సదానందం, కనకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, వైస్ ఎంపిపి కీసరి పాపయ్య, ఏఎంసి వైస్ ఛైర్మన్ కుంటయ్య, సీనియర్ నాయకులు కొండం రవిందర్‌రెడ్డి, ములుకల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌ను వీడి బీజేపిలో చేరిన సీనియర్ నాయకులు

### పార్టీలోకి ఆహ్వానించిన బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు

మిరుదొడ్డి, అక్టోబర్ 29, మనం న్యూస్ః కార్యకర్తలు సైనికుల్లా పని చేసి భారీ మెజార్టీతో తన గెలుపుకు కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మిరుదొడ్డికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగనమైన రాజు, పొడేటి నర్సింలుతోపాటు 30 మంది నాయకులు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపిలో చేరారు. బీజేపిలో చేరిన వారికి బీజేపి అభ్యర్థి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో తగిన గుర్తింపు లేదని గుర్తించిన బిఆర్ఎస్ నాయకులు దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే రఘునందన్‌రావుతోనే సాధ్యమవుతుందని గుర్తించి బీజేపిలో చేరడం జరిగిందని వారు తెలిపారు. చేరిన వారిలో కానుగంటి ప్రశాంత్, కానుగంటి స్వామి, వనం రవి, దినేష్, మహిపాల్, ప్రశాంత్, శ్రీనివాస్, హరీష్, రమేష్, మేఘనాథ్, కనకయ్య, శ్రీకాంత్, నర్సింలు, రాజు, బాలమల్లుతోపాటు తదితరులు ఉన్నారు.

## ఎలక్షన్ కోడ్...పోలీసుల విస్తృత తనిఖీలు



హుస్నాబాద్,అక్టోబర్ 29,(మనం న్యూస్)ః తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు చేస్తూ ఎటువంటి ఆధారాలు లేని డబ్బును స్వాధీనం చేసుకుంటున్నారు. హుస్నాబాద్‌లోని మహ్మదాపూర్ గ్రామ శివారు, కోహెడలోని బస్వాపూర్ గ్రామ శివారు, అక్కనపేటలోని కట్కూర్ గ్రామ శివారులో హుస్నాబాద్ సి.ఐ.కిరణ్., హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేశ్, అక్కనపేట ఎస్.ఐ.తాండ్ర వివేక్, కోహెడ ఎస్.ఐ.తిరుపతి, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సి.ఐ.కిరణ్ మాట్లాడుతూ సిపి శ్వేత ఆదేశాల మేరకు కేంద్ర బలగాలతో కలిసి ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు గురిచేసే వస్తువులను, మాదక ద్రవ్యాల రవాణాను ఆరికట్టేందుకే పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. రూ.50 వేలకు మించి ఉంటే డబ్బును స్వాధీనం చేసకుంటామని ఆయన తెలిపారు. సరైన ధృవపత్రాలు చూపిస్తే డబ్బును తిరిగి అందజేస్తామన్నారు. ఎన్నికల కోడ్‌ను ఏవరూ ఉల్లంఘించిన చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఇన్సిడెంట్ ఫ్రీ, ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

# హరీష్‌రావుకు పోటీ లేదు

**-లక్షా 50 వేల మెజార్టీ ఖాయం**

**-పిఏసిఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్**

**-బిఆర్ఎస్‌వి జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్**



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 29, మనం న్యూస్‌: సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీష్‌రావుకు పోటీ లేదని, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు కేవలం డిపాజిట్ కోసం మాత్రమే ప్రాకులాడే పరిస్థితి ఉందని సిద్దిపేట జిల్లా బిఆర్ఎస్‌వి ఉపాధ్యక్షులు నాగుల ప్రశాంత్, పిఏసిఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏమాత్రం పోటీ కారని, కేవలం డిపాజిట్ల కోసం మాత్రమే వారు పోటీపడే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనబడే కాంగ్రెస్, బీజేపి పార్టీలు నాయకులు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని వారు ప్రశ్నించారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజల కష్టసుఖాల్లో తోడుండే నాయకుడు హరీష్‌రావుకే ప్రజల మద్దతు ఉంటుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మరోసారి రాష్ట్రంలోనే రికార్డు మెజార్టీ హరీష్‌రావు విజయం సాధిస్తాడన్నారు. ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో హరీష్‌రావుకు లక్ష 50 వేల మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జేపి యాదవ్, బిఆర్ఎస్‌వి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసి నుండి భైరవభట్ల తొలగింపు

చేర్యాల, అక్టోబర్ 29, మనం న్యూస్‌: చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసి ఛైర్మన్ భైరవభట్ల చక్రధర్‌ను సస్పెండ్ చేసినట్లు డివిజన్ జేఏసి కో ఛైర్మన్ ఒగ్గ రాజు తెలిపారు. అదేవిధంగా భైరవభట్ల చక్రధర్ ఒగ్గ రాజును తొలగిస్తున్నట్లు ఒకరికి ఒకరు ప్రకటించుకున్నారు. దీంతో నాయకుల విధానాల పట్ల నాయకులంటే ఏంటి... వారు ఈవిధంగా వ్యవహరించడం సరికాదని ప్రజలు అనుకుంటున్నారు.

## మల్లన్నను దర్శించుకున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ



కొమురవెల్లి, అక్టోబర్ 29, మనం న్యూస్‌: కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారిని ఆదివారం నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ మల్లన్నను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. మల్లన్న దర్శనానికి విచ్చేసిన నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు మల్లేశం, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు మహాదేవుని భాస్కర్, రవి, మనోహర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు తప్ప బీఆర్ఎస్ ఒక్కిల్లైన ఇచ్చిందా

**అల్పాహార పథకం అటకెక్కింది**

**కె.బి.కాలనీని ఆదర్శంగా మార్చుతాం**

**కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్**



హుస్నాబాద్,అక్టోబర్ 29,(మనం న్యూస్‌): ఇందిరమ్మ ఇండ్లు తప్ప బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అయినా ఇచ్చారంటూ కరీంనగర్ మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రశ్నించారు. పట్టణ కేంద్రంలోని కస్తూర్బా (కె.బి.) కాలనీలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన గడప గడపకు ప్రచారం చేపట్టి కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలంటూ ఆయన అభ్యర్థించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని కె.బి.కాలనీలో ఆనాడు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మేము కాలనీ ఏర్పాటు చేసామని ఆయన గుర్తు చేసారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కాలనీలో ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. మున్సిపాలిటీ తరుపున హెచ్చరిక బోర్డులు పెట్టడం సిగ్గు చేటన్నారు. ఇండ్లు పాతపడ్డయి ఇందులో నివసిస్తే ఇల్లు కూలి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆ ఇంట్లో నివసించొద్దు అంటూ గోడకు రాయడం ఎంతవరకు సమంజసం అన్నారు. కనీసం వీరికైన డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలన్న జ్ఞానం లేదా అన్నారు. ప్రభుత్వం మార్పు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు.



కాంగ్రెస్ గ్యారంటీ కార్డుతో ప్రజలకు హామీ ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ మాట తప్పేటువంటి వ్యక్తి కాంగ్రెస్ మాటిచ్చింది అంటే కచ్చితంగా దానిని అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ సర్కార్ ఇటీవల అల్పాహార పథకాన్ని తీసుకొచ్చింది కానీ ఇప్పు ఏ పాఠశాలలో కూడా అల్పాహారం పెట్టడంలేదని ఆయన మండిపడ్డారు. ప్రతి పల్లెలో బెల్ట్‌షాపులతో ఆదాయం వస్తుందా లేదా అనే ధ్యాస తప్ప ప్రజలకు సంక్షేమ పథకాలను ఇవ్వాలన్న ఆలోచన లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ రెండు సార్లు అధికారంలోకి రావడానికి ముఖ్య కారణం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇస్తామన్న హామీతోనే గెలిచారని, గెలిచిన తర్వాత మాత్రం ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజల కష్టాలను తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. కె.బి.కాలనీని హుస్నాబాద్‌లోనే ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చిన నన్ను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండు లేదా మూడు నెలల్లోనే అన్ని గ్యారంటీలను అమలు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు కేడం లింగమూర్తి, డిసిసి కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎం.డి.హసన్, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ భూక్య సరోజన, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, నాయకులు వెన్న రాజు,పున్న సది, సుధాకర్, రాధమ్మ, బ్లెండినా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**-ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ**

**-దుబ్బాక సిఐ కృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్**

మిరుదొడ్డి, అక్టోబర్ 29, మనం న్యూస్‌: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని దుబ్బాక సిఐ మున్నూరు కృష్ణ అన్నారు. ఆదివారం కేంద్ర బలగాలతో మిరుదొడ్డి ఎస్ఐ నరేష్‌తో కలిసి మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మల్లుపల్లి, రుద్రారం గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణం





కల్పిస్తున్నామన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని, లేదంటే డయల్100కు కాల్ చేసి చెప్పాలన్నారు. మద్యానికి, డబ్బులకు, మరే ఇతర వస్తువులకు బానిసలు కావద్దని, తమకు నచ్చిన అభ్యర్థికి నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు వేసి ఓటు శాతాన్ని పెంచాలన్నారు. పోలింగ్ జరిగే రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరుగుతుందన్నారు. ఏ పార్టీ వారు వచ్చి ప్రచారం చేసినా అడ్డుకోవద్దని, ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చన్నారు. ప్రచారాన్ని అడ్డుకుంటే మాత్రం చర్యలు తప్పవన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు ఎలాంటి నేరపూరిత చర్యలకు దిగినా సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌తోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నేషనల్ నవక్రాంతి పార్టీ గజ్వేల్ అభ్యర్థిగా ఇంద్రగౌడ్

గజ్వేల్, అక్టోబర్ 29, మనం న్యూస్‌: నేషనల్ నవక్రాంతి పార్టీ గజ్వేల్ అభ్యర్థిగా యువజన నాయకుడు సిలివేరి ఇంద్రగౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు కనకం శ్రీనివాస్, కార్యదర్శి రొంపెల్ల శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా బి ఫామ్ అందుకున్నారు. ఇంద్రగౌడ్ సిద్దిపేట జిలా మార్కుక్ మండల యువజన సంఘాల అధ్యక్షులుగా మంచి గుర్తింపు తెచ్చుకొని వైఎస్‌టిపికి రాజీనామా చేసి తెలంగాణ రక్షణ సమితి పార్టీలో క్రియాశీలకంగా పని చేసి ఆ పార్టీకి కూడా రాజీనామా చేసి నేషనల్ నవక్రాంతి పార్టీలో చేరి గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనపై నమ్మకంతో తనకు బి ఫామ్ ఇవ్వడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



# బడుగు బలహీన వర్గాల సంక్షేమమే బీజేపి లక్ష్యం

**-బిసిల అభ్యున్నతికై బిసి కమీషన్ ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ**

**-మంత్రి హరీష్‌ది దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ**

**-రెండుసార్లు గెలిచిన బిఆర్ఎస్ నాయకులు దుబ్బాకకు ఏం చేశారు?**

**-మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే సంపూర్ణాభివృద్ధి చేస్తా**

**-దబ్బాక బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు**







మిరుదొడ్డి, అక్టోబర్ 29, మనం న్యూస్ః పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పని చేస్తుందని దుబ్బాక శాసన సభ్యులు రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల, అల్వాల, లింగుపల్లి గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపి అధికారంలోకి వస్తే వెనుకబడిన వర్గాల బిసి వ్యక్తినే ముఖ్యమంత్రి చేస్తామన్నారు. ఏ ప్రధానమంత్రి చేయని విధంగా నరేంద్రమోదీ రాజ్యాంగబద్ధంగా బిసి కమీషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రాష్ట్రంలోని 40 లక్షల మంది రైతులకు ఏటా రూ. 6 వేల చొప్పున ఇప్పటి వరకు 9 వేల కోట్లు జమ చేశామన్నారు. మరోసారి ప్రధానిగా మోదీ రావాలంటే ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారం కట్టాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రెండున్నర సంవత్సరాల పాటు కృషి చేయడం జరిగిందన్నారు. మరోసారి ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపించినట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్ల దాటినా అల్వాల చౌరస్తాలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఎందుకివ్వలేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిద్దిపేట ఒక కన్ను, దుబ్బాక ఒక కన్ను అని చెప్పిన మంత్రి హరీష్ దుబ్బాకపై ఎందుకు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతురుణమాఫీ చేస్తానన్న సీఎం కేసీఆర్ ఐదేళ్ల దాటిన తర్వాత ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కొంతమందికే రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. మాయమాటలు చెప్పే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రెండుసార్లు కారుగుర్తు వారు గెలిచి ఏం చేశారో అడగాల్సిన బాధ్యత కారుగుర్తుపై ఉందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు మద్యానికి పదివేల కోట్ల ఆదాయం వస్తే ప్రస్తుతం 50 వేల కోట్లకు పెరిగిందంటే ఎంత విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయో ఆలోచించాలన్నారు. మళ్లీ కారు గుర్తుకు ఓటేస్తే క్వాటర్‌కు రూ.300లు తీసుకునే పరిస్థితి నెలకొంటుందన్నారు. అప్పుడు కరెంటు బిల్లు రూ.100 వస్తే ఇప్పుడు వేయిపైన విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తుందన్నారు. ఉద్యోగాలు వేయడానికి చేతగాని ప్రభుత్వం మద్యం టెండర్లు మాత్రం అడ్వాన్స్‌గానే వేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఆలోచించి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, బీజేపి నాయకులు బాలేష్ గౌడ్, బిక్షపతి, మల్లేశం, చారి, నర్సింలు, రవిందర్‌తోపాటు ఆయా గ్రామాల బీజేపి నాయకులు, కార్యకర్తలున్నారు.

## పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం



సదాశివపేట, అక్టోబర్ 29, మనం న్యూస్ః సదాశివపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సదాశివపేట పట్టణ పద్మశాలి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ పద్మశాలి బిడ్డ గెలుపుకు అహర్నిశలు కృషి చేస్తామని పద్మశాలి సంఘం నేతలు తెలిపారు. తమ పూర్తి మద్దతు చింతా ప్రభాకర్‌కు ఉంటుందని వారు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం చింత ప్రభాకర్ మాట్లాడుతూ కేసీఆర్ బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. 2023 మేనిఫెస్టో కూడా అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టారన్నారు. దేశం నలువైపులా తెలంగాణ రాష్ట్రం వైపే చూస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పద్మశాలి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

**టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**

నంగునూరు, అక్టోబర్ 29, మనం న్యూస్ః కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఖాయమని, వచ్చిన వెంటనే ఆరు పథకాల గ్యారంటీ అమలు చేయడం ఖాయమని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నర్మెట గ్రామానికి బిఆర్ఎస్ నాయకులు సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు ఓటమి భయంతోనేప ఇచ్చి కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలతో అధికారంలోకి వస్తుందని ప్రజల్లో మంచి స్పందన రావడం ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తామని బహిరంగంగా చెప్పడంతో అవినీతికి అలవాటు పడ్డ బిఆర్ఎస్ నాయకులు ఆగమాగం అవుతున్నారన్నారు. రాష్ట్రంలో సర్వేల ఫలితం కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయనే వార్తలు మింగుడు పడడం లేదన్నారు. ఓటమి తప్పదన్న చేదు నిజాన్ని జీర్ణించుకోలేని కేసీఆర్ కుటుంబం వ్యక్తిగత దూషణలు చేయడం దివాలాకోరుతనమన్నారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ మరోసారి దొంగ హామీలతో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నాడని దుయ్యబట్టారు. ప్రజల నమ్మకాన్ని రాహుల్‌గాంధీ నిజం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో తప్పెట శంకర్, ఎంపిటిసి ఎనగందుల నితిన్ కుమార్, చెలికాని యాదగిరి, బాగు శ్రీకాంత్, రాజిరెడ్డి, అనరాజు నాగరాజు, ముస్త్యాల యాదగిరి, గందమల్ల యాదగిరి, గోపాల్‌రెడ్డి, గట్టు కిరణ్, రజనీకాంత్, గౌరబోయిన రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పొదుపుతో ఆర్థిక స్వయంప్రతిపత్తి

కొండపాక, అక్టోబర్ 29, మనం న్యూస్ః ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి క్రమశిక్షణతో కూడిన జీవితానికి పొదుపే ఏకైక మార్గమని విధాతా పురుషుల పొదుపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ అన్నారు. ఆదివారం కొండపాక మండలం మర్పడగ గ్రామంలో జరిగిన విధాతా పురుషుల పొదుపు సంఘం 19వ వార్షిక మహాసభలో ఆయన ప్రసంగించారు. గ్రామీణులు తమ ఆర్థిక అవసరాల కోసం ప్రభుత్వంపైనో, బ్యాంకులపైనో ఆధారపడకుండా తమ అవసరాలు తామే తీర్చుకునే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 20 సంవత్సరాల క్రితం పొదుపు సంఘం స్థాపించామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సంఘం రెండు లక్షల డెబ్బై వేల రూపాయల లాభాన్ని గడించిందన్నారు. ఈ లాభాన్ని 80 శాతం బోనస్‌గా సభ్యులకు అందిస్తామన్నారు. క్రమశిక్షణతో ప్రతి నెల పొదుపులు చెల్లిస్తూ సంఘం పురోభివృద్ధికి తోడ్పడుతున్న సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తొలుత సంఘం ఉపాధ్యక్షులు మర్యాల రవిందర్ వార్షిక నివేదిక సమర్పించగా సభ ఆమోదించింది. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అర్హులైన సభ్యులకు అభయనిధి సభ్యత్వ పత్రాలను హరినాథశర్మ అందజేశారు.

**-పొదుపు సంఘం అధ్యక్షులుగా తిరుపతిరెడ్డి**

విధాతా పురుషుల పొదుపు సంఘం అధ్యక్షులుగా ఊడెం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మర్యాల రవిందర్, పర్యవేక్షకులుగా టి. మల్లేశం, పాలకవర్గ సభ్యులుగా డి. యాదయ్య, డి. రాజయ్య, ఎం. సంజీవరెడ్డి, ఎం. కనకయ్య, సి.హెచ్. యాదగిరి, ఈశ్వర్, జి. అభిలాష్ యాదవ్, ఎండి. గఫూర్ ఎన్నికయ్యారు.



# మన నీళ్లు మనమే కాపాడుకోవాలి

### -ఎన్ని పోరాటాలకైనా సిద్ధమే

### -మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 29, మనం న్యూస్ః చేర్యాల, కొమురవెల్లి ప్రాంతానికి ఎంతో కష్టపడి తపాస్‌పల్లి రిజర్వాయర్ కట్టించి ఇక్కడి ప్రాంత రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు తాను ఎంతో పాటుపడ్డానని, ఇప్పుడు సిద్దిపేటకు కాలువల ద్వారా ఆ సాగునీరు తరలించుకుపోతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ నీళ్లను కాపాడుకోవాలని, ఇందుకు ఎన్ని పోరాటాలకైనా సిద్ధమని కాంగ్రెస్ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాల లెనిన్ నగర్ తాడూరు చిట్యాల దానంపల్లి, దొమ్మాట, గుర్జకుంట గ్రామాల్లో ఇంటింటి





ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెస్తామంటే మన ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ చేర్యాల వైపు ఒక్కసారైనా వచ్చాడా అని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే ఊరూరూ తిరుగుతున్నాడని , సీఎం దగ్గర ఉంటా అన్నోడు మన దగ్గరికి ఎప్పుడు వస్తాడు అని ప్రశ్నించారు. అనంతరం ఆకునూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరెడ్ల మాధవరెడ్డితోపాటు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, మాజీ జెడ్పీటిసి కొమ్ము నర్సింగరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, రామగల్ల పరమేశ్వర్, ఆగంరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

### -ఆరు పథకాలు గ్యారంటీగా అమలు చేస్తాం

### -కల్లబొల్లి మాటలతో కాలయాపన చేయం

### -బిఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

### -అత్తు ఇమామ్

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 29, మనం న్యూస్ః బిఆర్‌ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ ఇచ్చిన ఆరు పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని పథకాలను అమలు చేస్తామని ఆ రాష్ట్ర మంత్రి ప్రకటించారన్నారు. కొంతమంది తెరాస నాయకులు కార్యకర్తలను కర్ణాటక రైతుల పేరుతో తెలంగాణలో మరోసారి ఓట్లు దండుకునేందుకు మోసం చేస్తుందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని ఇచ్చిన హామీని ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, యువకులకు ఉపాధి కల్పన వంటి ప్రతి విషయంలో బిఆర్‌ఎస్ పార్టీ ఫెయిల్ అయిందన్నారు. సీఎం కేసీఆర్ అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలతో ప్రజలు ఆ పార్టీని నమ్మడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మజర్ మాలిక్, గయజుద్దీన్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ పార్టీల నుండి బీజేపిలోకి చేరికలు

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే



దౌల్తాబాద్, అక్టోబర్ 29, మనం న్యూస్ః దౌల్తాబాద్ మండలంలోని ముబారస్‌పూర్, ముత్యంపేట గ్రామాల నుండి బిఆర్‌ఎస్ తాజా మాజీ ఏడు వార్డు మెంబర్లు, అధ్యక్షులు పోతరాజు కిషన్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేతుల మీదుగా బీజేపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని తిరుమలాపూర్, ముత్యంపేట, ముబారస్‌పూర్ గ్రామాలకు చెందిన బీజేపిలో చేరారు. బీజేపిలో చేరిన వారిలో 10వ వార్డుకు చెందిన అనరాధ, 4వ వార్డు కె. లక్ష్మి, 6వ వార్డు ఎన్. నర్సవ్వ, 10వ వార్డు సభ్యులు స్వరూప, ముత్యంపేట మాజీ వార్డు మెంబర్లు తొడంగి రాజు, జంగం బాలయ్య, పంచమి రాజు, వార్డు సభ్యులు చేరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గడ్డమీద స్వామి, సర్పంచ్ సురేందర్‌రెడ్డి, ముబారస్ ఉప సర్పంచ్ స్వామి, కార్యదర్శి లక్ష్మణ్, మండల నాయకులు భూపాల్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు చంద్రం, కరుణాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.





## బీజేపిలో చేరిన రాయపోల్ బిఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 29, మనం న్యూస్ః రాయపోల్ మండలానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు బీజేపి పార్టీలో



చేరారు. ఆదివారం రోజున ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో రాయపోల్ మండల కేంద్రానికి చెందిన సుమారు 30 మంది బిఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రాయపోల్ మండల కేంద్రం నుండి బీజేపిలో చేరిన వారిలో బ్యాగరి స్వామి, పుట్ట చిన్న మల్లయ్య, పంబాల శేఖర్, పంబాల పరశురాములు, పంబాల సత్యనారాయణ, బైండ్ల నవీన్, పంబాల నరసింహులు, పుట్ట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

-బీజేపిలో చేరిన మాజీ ఎంపిటిసి

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన మాజీ ఎంపిటిసి చుక్క రాజవ్వ ఆదివారం బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో సుమారు 30 మందితో కలిసి బీజేపిలో చేరారు.

## బిసి బిడ్డగా ముందుకు వస్తున్న... ఆదరించండి

### టిఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి భీమ లక్ష్మణ్



చేర్యాల, అక్టోబర్ 29, మనం న్యూస్ః బిసి ముదిరాజ్ బిడ్డగా ప్రజల ముందుకు వస్తున్నా ఆదరించి జనగామ ఎమ్మెల్యేగా గెలిపించాలని టీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థి భీమ లక్ష్మణ్ కోరారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జరిగిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిఆర్‌ఎస్ పార్టీలో 2001 నుండి రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అడుగు జాడల్లో నడిచి అనేక ఉద్యమాల్లో పాలుపంచుకున్నానని, ప్రాంతీయేతరుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే చేర్యాల ప్రాంత ప్రజల సమస్యలు, నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించకుండా భూముల కబ్జా, రౌడీయిజం తప్ప ముత్యంరెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ముత్తిరెడ్డి ఆ అంశాన్ని నిర్లక్ష్యం చేశారని, ఆ పాపం తోటే సీటు కోల్పోయారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి టికెట్ ఖరారు కాగానే చేర్యాల రెవెన్యూ డివిజన్ జిఓ తెస్తామని చెప్పి ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినప్పటికీ చేర్యాల ప్రాంత ప్రజల ఆకాంక్ష రెవెన్యూ డివిజన్ జిఓ కాపీ తీసుకురాకుండా ప్రజలను ఓట్లు ఎలా అడుగుతున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ జనగామ సీటుపై పునరాలోచన చేసి జనగామ అభ్యర్థిని మార్చి ముదిరాజ్ బిడ్డకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసి ముదిరాజ్ బిడ్డగా తనను జనగామ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన గెలుపుకు యువకులు, మేధావులు, సబ్బండ వర్గాల ప్రజల మద్ధతుతో ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్, సోషల్ మీడియా వారియర్స్ ముస్త్యాల నవీన్, సురేష్, రాజు, వెంకటేష్, రవితేజతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

కొండపాక, అక్టోబర్ 29, మనం న్యూస్ః ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపియం కొండపాక మండల కార్యదర్శి అమ్ములు బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. అనేక గ్రామాల్లో వరి కోతలు మొదలు పెట్టి ఇప్పటికి 15 రోజులు అవుతున్నప్పటికి ఇప్పటికీ కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే ప్రారంభించాలని కోరారు. కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యాపారస్తులు వరి ధాన్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడి రాక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే

# బీటలు వారిన సిసి రోడ్డు



జిన్నారం, అక్టోబర్ 29, మనం న్యూస్ః జిన్నారం మండలంలోని పెద్దమ్మ దేవాలయంలో ఇటీవల వేసిన సిసి రోడ్డుకు నీళ్లు పోయలేదని, సిసి రోడ్డు వేసి వారం రోజులు అయినప్పటికీ క్యూరింగ్ కోసం ఒక రోజు నీళ్లు పోసి కాంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డి చేతులు దులుపుకున్నాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే పెద్దమ్మగూడెంలో గతంలో మల్లన్న గూడి ముందు వేసిన సిసి రోడ్డు పగిలిపోయిందని, ఇప్పటికైనా అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎస్సీ వర్గీకరణకు మద్ధతు ఇచ్చే పార్టీలకు ఓటేస్తాం

### మందకృష్ణ మాదిగ



సంగారెడ్డి, అక్టోబర్ 29, మనం న్యూస్ః ఎస్సీ వర్గీకరణకు స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే ఓటు వేస్తామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 18న హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానిస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చినా ఇప్పటి వరకు కార్యాచరణ చేయలేదన్నారు. హామీలు ఇస్తే సరిపోదని, వాటిని అమలు చేయాలని చురకలంటించారు. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అక్కడ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

## ఎంపి స్వగ్రామంలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరిక

### ఆహ్వానించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాక, అక్టోబర్ 29, మనం న్యూస్ః దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామమైన పోతారం గ్రామం నుండి పలువురు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పోతారం బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొత్త మహిపాల్‌రెడ్డి, కొత్త కేశవరెడ్డి, కొత్త రాజిరెడ్డి, కొత్త రమేష్‌రెడ్డి, కొత్త జీవన్‌రెడ్డి, కొత్త నర్సింహారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీకి ఓటు వేయాలని కోరుతామన్నారు. బిఆర్ఎస్, బీజేపి పార్టీ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలకు ఎలాంటి లబ్ధి జరగడం లేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తేవడం ఖాయమన్నారు.

# గజ్వేల్‌లో ఈటల గెలుపుతోనే ప్రజాస్వామ్యం గెలిచినట్లు

### -బీజేపి నాయకులు

### -ఈటల సమక్షంలో బీజేపిలో చేరిన ఆయా పార్టీల యువత



గజ్వేల్, అక్టోబర్ 29, మనం న్యూస్ః గజ్వేల్‌లో వచ్చే ఎన్నికల్లో ఈటల రాజేందర్ గెలిస్తేనే ప్రజాస్వామ్యం గెలిచినట్లని, కేసీఆర్‌కు ఈసారి ఓటమి తప్పదని బీజేపి నాయకులు అన్నారు. గజ్వేల్లో కంటికి కనబడని మద్ధతు బీజేపికి ఉందని, ఆ మద్ధతే బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను ఓడిస్తుందన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనతో నేడు రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం సంతోషంగా లేదన్నారు. షామీర్‌పేటలోని ఈటల రాజేందర్ నివాసంలో గజ్వేల్ నియోజకవర్గ బీజేపి ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించిన అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లో బీజేపి కార్యకర్తలను, నాయకులను బిఆర్ఎస్ నాయకులు ఎన్నో రకాలుగా ప్రలోభపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తారని, వాటన్నింటినీ తిప్పికొట్టాలన్నారు. ప్రతి బీజేపి నాయకుడు, కార్యకర్త తానే ముఖ్య నాయకుడిగా భావించి నేరుగా ప్రజల వద్దకు వెళ్లి బిఆర్ఎస్ అరాచకాలను, కేసీఆర్ అవినీతి పాలనను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా బీజేపి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను బీజేపి వైపు మరలేలా చూడాలన్నారు. బీజేపి పార్టీలో బిసిలకు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా యువత ఎదగడానికి బీజేపి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గజ్వేల్‌లో తన పోటీతో ఎంపిటిసిలకు గౌరవం పెఇరగిందని, అందరికీ డబ్బులు వచ్చాయని, తాను అక్కడికి రాకపోయి ఉంటే డబ్బులు వచ్చి ఉండేవా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకుల బెదిరింపులకు ఎవరు భయపడవద్దని, ధీటుగా నిలబడి సరైన సమాధానం చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీజేపి పార్టీయే అని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపియే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు గాడిపల్లి భాస్కర్, సింగం సత్తయ్య, మహేష్, మనోహర్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహంకాళి దేవాలయంలో

## ముడుపు కట్టిన మున్సిపల్ ఛైర్మన్

గజ్వేల్, అక్టోబర్ 29, మనం న్యూస్ః ముచ్చటగా మూడోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ కావాలని కోరుకుంటూ మహంకాళి అమ్మవారి దేవాలయంలో మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డిలతో కలిసి ఆయన ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ అఖండ మెజార్టీతో అధికారం చేపట్టాలని కోరుతూ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధిస్తూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తూ సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు మద్ధతుగా పలువురి తీర్మానాలు



గజ్వేల్, అక్టోబర్ 29, మనం న్యూస్ః సీఎం కేసీఆర్‌కు మద్ధతుగా వచ్చే ఎన్నికల్లో తమ పూర్తి మద్ధతు ప్రకటిస్తున్నారు ఆయా సంఘాల వారు. ఆదివారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన సెటిలర్లు ఓటు బ్యాంకు కలిగిన వారంతా సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై తామంతా కేసీఆర్‌కు సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆ తీర్మాన కాపీని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందించారు. అదేవిధంగా రహదారి వెంబడి వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తులు సైతం సీఎం కేసీఆర్‌కు తమ సంపూర్ణ మద్ధతు తెలిపారు.

## బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

### పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చింతా ప్రభాకర్



సదాశివపేట, అక్టోబర్ 29, మనం న్యూస్ః సదాశివపేట మండలంలోని ఎంకపల్లి గ్రామం నుండి కాంగ్రెస్, బీజేపి పార్టీలకు చెందిన 70 మంది యువకులు సంగారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభా కర్ క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్‌లో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అనిల్, అక్షయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు, మేనిఫెస్టో చూసి తాము పార్టీలో చేరుతున్నామన్నారు. బిఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే చింతా ప్రభాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలనే ఉద్దేశ్యంతో పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం చింత ప్రభాకర్ మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. ఈసారి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానికులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు , ఏఎంసి డైరెక్టర్ రాములు, ఎంపిటిసి అహ్మద్, సర్పంచ్ సునంద గండయ్య, మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు శివ, శ్రవణ్, మహబూబ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవుల రాజిరెడ్డి అభ్యర్థిత్వంపై అసంతృప్తి

### గాంధీభవన్ ఎదుట నిరసన



మెదక్, అక్టోబర్ 29, మనం న్యూస్ః నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డిని ప్రకటించడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. ఆదివారం నర్సాపూర్ కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో నిరసనకు దిగారు. ఆవుల రాజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు భారీ ఎత్తున్న నిరసన చేపట్టారు. నలుగురు కార్యకర్తలు పెట్రోల్ పోసుకొని మరీ నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం శ్రమించిన నేతలను కాదని కోవర్టులకు టికెట్ ఎలా కేటాయిస్తారంటూ గాంధీభవన్ మెట్లపై ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థిని మార్చే వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఖరాకండిగా తేల్చి చెప్పారు. గాలి అనిల్‌కుమార్‌కు టికెట్ కేటాయిస్తే మద్ధతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎంపిపి , మాజీ జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.